

డీసీఎంఎస్ సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అదితిసింగ్



వాడి వేడిగా డీసీఎంఎస్ సమావేశం

● అవకతవకలపై జేసీ అసహనం

కడప (ఎన్టీఆర్ సర్కిల్), ఆగస్టు 28: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) జనరల్ బాడీ మీటింగ్ వాడి వేడిగా సాగింది. జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అధ్యక్షతన డీసీఎంఎస్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జే సీ మాట్లాడుతూ సంస్థలో ఇంతమంది సిబ్బంది ఉన్నప్పటికీ వారికి తగిన పని లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం ద్వారా అమలవుతున్న వివిధ పథకాల పనులను తీసుకుని వ్యాపారాలు చేయవచ్చుకదా అన్నారు. అదే విధంగా సిబ్బందికి ఇంక్రిమెంట్లు ఇవ్వడంలో కూడా రూల్స్ పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరించారంటూ అసహనం వ్యక్తం చేశారు. సిబ్బందికి పని విభజన చేసి సంబంధిత రికార్డులను తనకు పంపించాలని బిజినెస్ మేనేజరు ఖాదర్‌వల్లిని ఆదేశించారు. అదే విధంగా వివిధ వ్యాపార సముదాయాలకు కడప నగరంలోని చెమ్ముమియ్యాపేటలో లీజుకు ఇచ్చిన విషయంపై ఆమె ప్రస్తావించారు. గతంలో ఉన్న పీఐసీ కమిటీకి రిజిస్టరు అనుమతి లేకుండా లీజుకు ఇవ్వడం చెల్లదన్నారు. విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి ఆ కమిటీకి అధికారం లేదన్నారు. గతంలో ఎంక్వయిరీ మేరకు డీసీఎంఎస్‌లో సిబ్బందిని తొలగించారని, వారందరూ కోర్టుకు వెళ్లడంతో తిరిగి కొనసాగుతున్నట్లు రికార్డుల ద్వారా తెలుస్తోందన్నారు. వీరందరికీ ఏ విధంగా పదోన్నతులు, ఇంక్రిమెంట్లు ఇచ్చారన్న దానిపై వివరణ కోరారు. సొసైటీ స్పెషల్ ఆఫీసరు ఎం.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ డీసీఎంఎస్ కమిటీలో పీఏసీఎస్ ఛైర్మన్లు మెంబర్లుగా ఉంటారని, దీంతో రైతుల నుంచి సేకరించే ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తుల ద్వారా కొనుగోలు చేయడం నిబంధనలకు విరుద్ధమని జేసీ దృష్టికి తెచ్చారు. పీఏసీఎస్ ఛైర్మన్లను కాదని ప్రైవేటు వ్యక్తుల ద్వారా కొనుగోళ్లు చేయడం ద్వారా సంస్థకు నష్టం వాటిల్లిందని వివరించారు. డీసీఎంఎస్‌లో ఏర్పాటు చేసిన ధరల్లో కూడా వ్యత్యాసం వచ్చిందని రికవరీ చేయడానికి సంబంధించి నిర్ణయం తీసుకోవాలన్నారు. బిజినెస్ మేనేజరు నిర్లక్ష్యంగా వ్యవహరించారని పూర్తిస్థాయిలో సహకారశాఖ దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ఆయన వివరించారు. దీంతో డీసీఎంఎస్ నిర్వహణపై సహకారశాఖ నుంచి ఒక వ్యక్తిని పర్యవేక్షణ అధికారిగా నియమించేందుకు ఉత్తర్వులు జారీ చేయాలంటూ డీసీవో సుభాషిణిని జేసీ ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

క్రీడల్ని ఎల్‌ఐసీ ప్రోత్సహిస్తుంది

● సీనియర్ డివిజనల్ మేనేజరు రవికుమార్

● ఎల్‌ఐసీ జోనల్ స్థాయి చెస్, క్యారమ్స్ పోటీలు ప్రారంభం

కడప(సెవెన్‌రోడ్స్), ఆగస్టు28: ఎల్‌ఐసీ క్రీడాపోటీలను ప్రోత్సహిస్తుందని.. ఎంతో చరిత్ర కలిగిన కడపలో ఎల్‌ఐసీ జోనల్ చెస్, క్యారమ్స్ పోటీలు మరోసారి నిర్వహించే అవకాశం రావడం తమకు గర్వకారణమని ఆ సంస్థ సీనియర్ డివిజనల్ మేనేజరు జీకేఆర్వీ రవికుమార్ తెలిపారు. కడప నగరంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి 80 మంది పాల్గొన్న జోనల్ చెస్, క్యారమ్స్ టోర్నమెంట్లను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. స్పోర్ట్స్ ప్రమోషన్ కమిటీ సభ్యుడు సురేశ్ మాట్లాడుతూ చెస్ పోటీల్లో ఎల్‌ఐసీ క్రీడాకారులు అంతర్జాతీయ యువనిక మీద సత్తా చాటుతున్నారని అన్నారు. మేనేజరు సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో కూడా కడప ఎల్‌ఐసీ జోనల్ టోర్నమెంట్లను ఘనంగా నిర్వహించిందన్నారు. ఇందులో విజేతలు ఎల్‌ఐసీ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం క్యారమ్స్ అంతర్జాతీయ క్రీడాకారిణి అపూర్వ క్రీడాకారులచే క్రమశిక్షణను, క్రీడా స్ఫూర్తిని పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జోనల్ స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డుసభ్యుడు డీవైఎస్‌ఐ శర్మ, చీఫ్ రెఫరీ జలీల్, చీఫ్ ఆర్బిటర్ ఉదయ్‌కుమార్‌నాయుడు, సంఘాల ప్రతినిధులు రఘునాథరెడ్డి, చంద్రపాల్, సంజయ్‌కుమార్, రామాంజనేయులు, రెడ్డిభాస్కర్, అధికారులు లక్ష్మినారాయణ, రమేశ్‌బాబు, బాబు, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



క్యారమ్స్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న ఎల్‌ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజరు రవికుమార్, అంతర్జాతీయ క్రీడాకారిణి అపూర్వ





ఐదేళ్లుగా ఉద్యోగాల్లేక.. పరిశ్రమలు ఏర్పాటుకాక అల్లాడుతున్న నిరుద్యోగులకు ఇది శుభవార్త. పేరుకే కొప్పర్తి పారిశ్రామిక వాడ.. వేల ఎకరాల భూములున్నా ఐదేళ్లుగా ఇక్కడకు వచ్చిన కంపెనీలు ఒకటి రెండే. ఉపాధి దొరికిందీ తక్కువమందికే. జగన్ ప్రభుత్వం దీనిపై పెద్దగా దృష్టి సారించలేదు. కేంద్రంలో మోదీ ప్రభుత్వంతో అంటకాగినా స్వప్రయోజనాలకు తప్ప జిల్లా అభివృద్ధికోసం కేంద్రాన్ని పట్టుబట్టలేదు. ఇటీవల వైసీపీ ఓటమి పాలై.. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో జిల్లాకు మహర్దశ పట్టనుంది. కొప్పర్తి పారిశ్రామిక వాడను ఇండస్ట్రియల్ పార్కు సిటీగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.2,137 కోట్లతో దీనిని అభివృద్ధి చేయనుంది. 54 వేల మందికి ఉద్యోగాలు కల్పించేలా పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి.

కడపకు మహర్దశ

● ఇండస్ట్రియల్ పార్కు సిటీగా కొప్పర్తి ● రూ.2,137 కోట్లతో అభివృద్ధి ● 54వేల మందికి ఉద్యోగాలు

● ఆటోమొబైల్, టెక్స్‌టైల్స్, కెమికల్స్ పరిశ్రమల ఏర్పాటు ● మారనున్న జిల్లా రూపురేఖలు

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన పరిస్థితులున్నాయి. ఇక్కడ పరిశ్రమలకు అవసరమైన భూములు, నీరు, రోడ్డు కనెక్టివిటీ, రవాణా, రైలు మార్గం, ఎయిర్ కనెక్టివిటీ ఉన్నాయి. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా ఇప్పటి దాకా పరిస్థితి ఉండేది. 2019 నుంచి 2024 వరకు జగనే సీఎంగా ఉన్నారు. పార్లమెంటు, రాజ్యసభల్లో 20 మంది ఎంపీలు ఉన్నారు. అయినా వారిని జిల్లా అభివృద్ధికి వాడుకోకుండా సొంత ప్రయోజనాలకు వాడుకున్నారు. జగన్ స్టీలు ప్లాంటు నిర్మాణానికి రెండుసార్లు టెంకాయలు కొట్టాడే కానీ ఫ్యాక్టరీ నిర్మాణం మాత్రం చేపట్టలేదు. అయితే నిన్న జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో కూటమికి జనం అద్భుత మెజార్టీ కట్టబెట్టారు. కేంద్రంలో మోదీ మరోసారి రాగా, రాష్ట్రంలో చంద్రబాబు మళ్లీ సీఎం అయ్యారు. ఎన్డీయే కూటమితో జిల్లా రూపురేఖలే మారిపోనున్నాయి. ఇందులో భాగంగా ఓ బృహత్తర కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దేశంలో కొత్తగా 12 ప్రాంతాల్లో 12 స్మార్ట్ పారిశ్రామిక సిటీలను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్రమంత్రి అశ్వని వైష్ణవ్ వెల్లడించారు. తయారీ రంగానికి ఈ స్మార్ట్ సిటీలు మరింత ఊతమిస్తాయన్నారు. పదిలక్షలు ఉద్యోగాల కల్పన జరుగుతుందన్నారు. ఈ 12 స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీలలో మన కొప్పర్తి పారిశ్రామికవాడ కూడా ఉంది. దీనిని పారిశ్రామిక హబ్ కింద అభివృద్ధి చేస్తారు. ఇక్కడ 54వేల మందికి ఉపాధి కలుగనుంది. దీంతో జిల్లా ముఖచిత్రమే మారిపోనుంది.



యువతకు ఉపాధి అవకాశాలు

కడప నగర శివారులోనే కొప్పర్తి పారిశ్రామికవాడ ఉంది. సౌత్ బ్లాక్‌లో 2,596 ఎకరాలు ఉంది. దీనిని పారిశ్రామిక స్మార్ట్‌సిటీలో భాగంగా 2,137 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తారు. అంటే రోడ్లు, విద్యుత్, నీరు, ఇతర సకల సదుపాయాలు ఏర్పాటు చేస్తారు. మొత్తం రూ.8,760 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ఇక్కడ ఏర్పాటు చేసే పరిశ్రమల ద్వారా 54,500 మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి. ఈ పారిశ్రామిక సిటీలో ఆటోమొబైల్స్ తయారీ, టెక్స్‌టైల్స్, కెమికల్స్, నాన్‌మెటలిక్ మినరల్స్ మెటలిక్ మినరల్స్.. ఇలా పలు పరిశ్రమల ఏర్పాటు కానున్నాయి. ఇది తయారీ ఉత్పత్తి రంగానికి హబ్‌గా మారనుంది. దీంతో కడప జిల్లా రూపురేఖలే మారిపోన్నాయి. ఇక్కడ ప్రత్యక్షంగా 54వేల మందికి ఉపాధి కలిగితే వాటి అనుబంధ సంస్థల ద్వారా ఈ ఉపాధి సంఖ్య మరింత పెరుగుతుంది.

అన్నీ సానుకూలతలే

కొప్పర్తి పారిశ్రామికవాడకు ఎన్నో సానుకూలతలు ఉన్నాయి. రాయలసీమ నడిబొడ్డు అయిన కడప శివారులోనే కొప్పర్తి పారిశ్రామిక ఉండడం, ఇక్కడ నుంచి రోడ్లు, రైలు, ఎయిర్ కనెక్టివిటీతో పాటు విమానాశ్రయం కూడా దగ్గరలోనే ఉండడం బాగా కలిసి వచ్చే అంశం. జిల్లాలో కడప-పులివెందుల సేట్ హైవేకి కొప్పర్తి పారిశ్రామికవాడ ఐదు కి.మీ దూరంలో ఉంది. అలాగే.. కర్నూల-రాణిపేటకు ఎన్‌హెచ్ 40 ఉంది. కడప - చెన్నై జాతీయ రహదారికి కొప్పర్తి 8 కి.మీ దూరంలో ఉంది. ఎన్‌హెచ్ 544ఎఫ్ అనంతపురం - విజయవాడ, ఇక క్రిష్ణపట్నం పోర్టు సైతం దీనికి దగ్గరలో ఉన్నాయి. క్రిష్టాపురం రైల్వేమార్గానికి 9 కి.మీ, కడప జంక్షన్‌కు 13 కి.మీ, కడప విమానాశ్రయం 11 కిమ.మీ, తిరుపతిఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు 150 కి.మీ, క్రిష్ణపట్నం పోర్టు 200 కి.మీ, క్రిష్ణపట్నం -చెన్నై పోర్టు 270 కి.మీ, కొప్పర్తి రైలు కార్గో 9 కి.మీ దూరంలో ఉన్నాయి. ఇటు క్రిష్ణపట్నం 196 కి.మీ, అనంతపురం 157 కి.మీ దూరంలో ఉన్నాయి. చెన్నై, బెంగళూరు మెట్రో సిటీలు 250 కి.మీ దూరంలో ఉన్నాయి. అక్కడా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులున్నాయి. కొప్పర్తి పారిశ్రామిక వాడకు ఇన్ని సానుకూలతలు ఉన్నాయి.



మారిపోనున్న రూపురేఖలు

కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ సిటీతో కడప రూపురేఖలు మారిపోనున్నాయి. జిల్లాలో ఉపాధి కల్పించే పరిశ్రమలు లేవు. కనీసం 10వేల మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలే లేవు. ఏవో చిన్న చిన్నవి ఉన్నాయి. స్టీలు ఫ్యాక్టరీ కోసం జిల్లావాసులు 18ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. ఇంతవరకు అడుగులు ముందుకు పడడంలేదు. కొప్పర్తిలో చిన్న చితక పరిశ్రమలు ఉన్నా కనీసం 4వేల మందికి కూడా ఉపాధి దొరకడం లేదు. దీంతో ఉపాధి లేక కొందరు నిరుద్యోగులు ఇతర రాష్ట్రాలకు వలస పోతే మరికొందరు గల్ఫ్‌కు వెళ్లారు. ఈ నేపథ్యంలో కొప్పర్తిని ఇండస్ట్రియల్ సిటీగా కేంద్రం ప్రకటించి రూ.2,137 కోట్లతో అభివృద్ధి చేయనుండడంతో జిల్లా రూపురేఖలే మారనున్నాయి. దీంతో కడప సిటీ కూడా అభివృద్ధి చెందనుంది.



పోలీసులపై ప్రజల్లో నమ్మకం పెరగాలి



● నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ

కడప (క్రైం), ఆగస్టు 28: పోలీసుశాఖ పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంపొందేలా విధులు నిర్వర్తించాలని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ఇటీవల బహిరంగ మద్యపానంపై నిఘాతో నేరాల శాతం బాగా తగ్గడంతో పాటు ప్రజల నుంచి డయల్ 100కు వచ్చే ఫిర్యాదులు కూడా బాగా తగ్గాయని ఎస్పీ తెలిపారు. గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి దాడులు చేయాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం జిల్లాలో ఎక్కడా జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగు కేసులను పరిష్కరించాలన్నారు. చోరీ కేసుల్లో సొత్తు రికవరీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో అదనపు ఎస్పీ వెంకటరాముడు, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

కలమల్లలో తెలుగుభాషా దినోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లు



నేడు కలమల్లలో తెలుగుభాషా దినోత్సవ వేడుకలు

● హాజరవుతున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఎర్రగుంట్ల, ఆగస్టు 28: తెలుగుభాషా దినోత్సవ వేడుకలు ఎర్రగుంట్ల మండలంలోని కలమల్లలో గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి తెలుగు శాసనం లభ్యమైన కలమల్ల చెన్నకేశవ, కామాక్షి సమేత సిద్ధేశ్వర స్వామి, వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ వేడుకలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ అధికారులు, స్థానిక అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. 4 శాసనాలను ఒకే చోట అమర్చేందుకు వేదికను తయారు చేశారు. పురాతన ఆలయాలకు రంగులు వేశారు. చాలా పురాతనమైన ఈ ఆలయాలను ఇప్పటి వరకు పట్టించుకున్న వారు లేరు. కాగా.. తెలుగు శాసనాలు ఇక్కడ ఉన్నాయని తెలిసి కలెక్టర్ ఇదే చోట తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించేందుకు నిర్ణయించడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. దీనికి తోడు బహుభాషా కోవిదుడు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు గురువారం మధ్యాహ్నం 12గంటలకు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేస్తుండటంతో ఏర్పాట్లు భారీగా చేస్తున్నారు. వర్షం వచ్చినా తడవకుండా సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చే తెలుగుభాషా పండితులు, ప్రజాప్రతినిధులు ప్రజలు కూర్చేనేందుకు షామియానాలు, కుర్చీలు వేయించారు. కలెక్టర్ లోతేటి శివశంకర్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డి, జిల్లాలోని ఇతర శాసన సభ్యులకు ఆహ్వానాలు పంపినట్లు సమాచారం. పంచాయతీరాజ్ ఈఈ శ్యాంసుందర్, డీఈ భాస్కర్‌రెడ్డి, ఎన్డీయే కూటమి నాయకులు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

జిల్లాలో ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లు

● కడప, ప్రొద్దుటూరులో ఏర్పాటు

కడప, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎఫ్‌ఎం రేడియోల జాకీల గొంతు ఇన్నాళ్లూ హైదరాబాదు, వైజాగ్, తిరుపతిలాంటి చోట విన్నాం. ప్రైవేటు రంగంలో రేడియో మిర్చి, ఇతర ఎఫ్‌ఎం రేడియోలు బాగా ఫేమస్ అయ్యాయి. అందులో జాకీల వ్యాఖ్యలు శ్రోతలకు బాగా కనెక్ట్ అయ్యాయి. హైదరాబాదు సిటీకి వెళితే ఆటోలు మొదలు ఎక్కడపడితే అక్కడ ఇవి మోగిపోతుంటాయి. ఇప్పుడు ఆ జాకీల గొంతు మనజిల్లాలో కూడా వినబడనుంది. కడప ఆలిండియా రేడియో స్టేషన్‌లో రేడియోతో పాటు ఎఫ్‌ఎం ఉంది. ప్రైవేటు రంగంలో ఎఫ్ఎంల ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 234 పట్టణాల్లో ఎఫ్‌ఎం రేడియోలు ఏర్పాటు కానున్నాయి. కడపలో 3, ప్రొద్దుటూరులో 3 ఏర్పాటు చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఇక్కడ కూడా జాకీల గొంతు వినబడనుంది. మొబైల్ ఫోను వచ్చినాక టెక్నాలజీ మారిపోయింది. ఇప్పుడు అంతా మొబైల్ ఫోన్ వాడుతున్నారు. దీంతో ఎఫ్ఎంకు ఆదరణ పెరుగుతోంది. ఇటీవల డిజిటల్ ప్రకటనలు పెరిగాయి. ప్రొద్దుటూరు బిజినెస్‌కు అడ్డాగా ఉంది. కమర్షియల్ స్పేస్ బాగా ఉంది. కడప కూడా ఇటీవల బాగా డెవలప్ అవుతోంది అవుతోంది. దీంతో ఎఫ్ఎంలకు ఆదరణ ఉంటుందని అంటున్నారు.

పరిశ్రమల్లో భద్రతా చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్ లోతేటి శివశంకర్

కడప(కలెక్టరేట్), ఆగస్టు 28: పరిశ్రమల్లో భద్రతా చర్యలు తీసుకోవాలని, చిన్న మానవ తప్పిదం వల్ల కార్మికుల ప్రాణాలు కోల్పోయే పరిస్థితి రాకూడదని కలెక్టర్ లోతేటి శివశంకర్ పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులను హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ కృష్ణమూర్తితో కలసి కలెక్టర్ జిల్లా పరిశ్రమల భద్రతా కమిటీ, జిల్లా విపత్తుల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో కార్మికులకు రక్షణ కల్పించేందుకు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి కమిటీలో పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అందులో భాగంగా అన్ని పరిశ్రమల్లో భద్రత చర్యలను పర్యవేక్షించాలన్నారు. రెడ్ కేటగిరీలోని పరిశ్రమల్లో తగిన రక్షణ, భద్రత కల్పించేందుకు, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన స్టాండర్డ్ ఆపరేషన్ ప్రోటోకాల్ చర్యలను కచ్చితంగా పాటించాలన్నారు. జిల్లాలో మొత్తం 1092 రిజిస్టర్డ్ ఫ్యాక్టరీలు ఉండగా ఇందులో రెడ్‌కేటగిరీ పరిశ్రమలు 28 ఉన్నాయన్నారు. వీటన్నింటిలో కలిపి దాదాపు 33,206 మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వారందరికీ ఫ్యాక్టరీలలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. 45 రోజులకు ఒకసారి భద్రతా చర్యల అమలుపై తనిఖీలు నిర్వహించాలన్నారు. రెవెన్యూ, ఫైర్ శాఖల అధికారులు సమన్వయంతో తరచుగా మాక్‌డ్రిల్ నిర్వహిస్తూ కార్మికుల్లో, ప్రజల్లో, ఫ్యాక్టరీలలో ప్రమాదాల నివారణకు అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై అవగాహన పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు వెంకటపతి, శ్రీనివాసులు చంద్రమోహన్, వెంకటేశ్వర్లు, పరిశ్రమల శాఖ డిప్యూటీ జెడ్ఎం ఉదయ్ కుమార్, జీఎం జయలక్ష్మి, డీటీసీ మీరాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

ఉత్సవమూర్తుల ఊరేగింపులో ఉద్రిక్తత

● ఇరువర్గాల మోహరింపు

● పోలీసుల రంగప్రవేశం



ఆలయంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

చెన్నూరు, ఆగస్టు 28: చెన్నూరులో శివపార్వతుల విగ్రహాల ఊరేగింపులో ఉద్రిక్తత చోటు చేసుకుంది. చివరకు పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. వివరాలిలా.. చెన్నూరు ట్రంకురోడ్డులో దాదాపు 500 ఏళ్ల క్రితం నిర్మించిన నాగలింగేశ్వర ఆలయం ఉంది. దాని ఎదురుగానే ఖిల్లా మసీదు ఉంది. ఖిల్లా మసీదులో ఎప్పుడు నమాజ్ చేసినా శివాలయంలో భక్తులు పూజా కార్యక్రమాలు, మంగళవాయిద్యాలు నిలిపి వేసి సహకరిస్తుంటారు. కాగా.. రెండురోజుల క్రితం నాగలింగేశ్వరాలయంలో ధ్వజస్తంభ శిఖర కలశ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభించారు. గురువారం నాటితో ఈ ఉత్సవాలు పూర్తికానున్నాయి. దాతలు ఇచ్చిన ఉత్సవ విగ్రహాలను బుధవారం ఉదయం ఊరేగించాలని భక్తులు నిర్ణయించారు. ఈ ఊరేగింపును శివాలయానికి ఎదురుగా మసీదుకు ఉత్తరం వైపుగా తీసుకెళ్లారు. అయితే మసీదుకు చెందిన కొందరు ఊరేగింపును మసీదు ముందు వైపు ట్రంకు రోడ్డు గుండా నిర్వహించాలని.. మసీదు ఉత్తరం వైపు చేస్తే ఒప్పుకోమంటూ వాదనకు దిగారు. దీంతో పెద్ద ఎత్తున వాదనలు జరిగాయి. పరిస్థితి విషమించే పరిస్థితి ఏర్పడడంతో సీఐ పురుషోత్తంరాజు అక్కడకు వచ్చి ఇరువర్గాలకు నచ్చచెప్పి పంపించారు. ఈ లోగా క్రేన్ సహాయంతో ఆలయంలో ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేయడం మొదలు పెట్టారు. ఇరువర్గాలు మళ్లీ అక్కడకు పెద్దఎత్తున చేరుకుని వాదనకు దిగడంతో పోలీసు శాఖ ఉన్నతాధికారులకు సీఐ సమాచారం అందించారు. దీంతో చెన్నూరుకు ప్రత్యేక పోలీసు దళం వచ్చింది. అలాగే అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, సీఐలు బాబా, సయ్యద్‌హసం, సిబ్బంది వచ్చారు. మేం ప్రశాంతంగా ఊరేగింపు నిర్వహిస్తున్నాం, మాకు అడ్డు తగలడమేమిటని ఏఎస్పీని ఆలయ నిర్వాహకులు ప్రశ్నించారు. ఎన్నో ఏళ్లుగా ఇదే మార్గంలో ఊరేగింపు జరుగుతోందన్నారు. చివరకు ఏఎస్పీ వారికి నచ్చచెప్పి.. మసీదు పక్క నుంచి వెళ్లిన ఉత్సవ మూర్తుల ఊరేగింపు తిరిగి హైస్కూలు, పాతబస్టాండు మీదుగా ఆలయానికి వచ్చేలా చేశారు.

అనంతరం ఏఎస్పీ ఆధ్వర్యంలో ఇరువర్గాలను పిలిపించి పోలీస్ స్టేషన్ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేశారు. ఇరువర్గాలు శాంతియుతంగా ఉండాలని సమావేశంలో సీఐ పదేపదే చెప్పారు. అయినా ఇరువర్గాలు వాదులాటకు దిగారు. దీంతో ఏఎస్పీ వెంకటరాముడు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య చిన్నదైనా భూతద్దంలో చూసే ప్రయత్నం మానుకోవాలన్నారు. కలిసిమెలిసి ఉంటేనే మత సామరస్యం వెల్లివిరుస్తుందన్నారు. ఎప్పుడూ లేని విధంగా ఒక చిన్న విషయానికి ఇంత రాద్ధాంతం చేయడం, ఇరువర్గాలు మోహరించడం సరైన పద్ధతి కాదన్నారు. గురువారం జరిగే కార్యక్రమానికి అందరూ సహకరించాలని గట్టిగా చెప్పారు. కాగా ఉత్సవాల ముగింపు సందర్భంగా గొడవలు జరిగే అవకాశం ఉందని, పోలీసులు మరింత భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

మసీదు, శివాలయం వద్దే పోలీసుల మకాం

శివపార్వతుల ఊరేగింపులో తలెత్తిన ఉద్రిక్తత నేపథ్యంలో ఏఎస్పీ వెంకటరాముడు ఆధ్వర్యంలో సీఐలు పురుషోత్తంరాజు, సయ్యద్ హసం, బాబా తదితరులు బుధవారం రాత్రి స్థానిక ట్రంకు రోడ్డు పైనే కాపలా కూర్చున్నారు. రాత్రివేళ ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా కడప నుంచి అవసరమైన ఫోర్స్‌ను తెప్పించారు. అలాగే ప్రతిష్ఠ కార్యక్రమం అయిపోయేంత వరకు ఇక్కడే ఉంటామని, ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని ఏఎస్పీ హెచ్చరించారు.



ఊరేగింపును ఇబ్బంది లేకుండా పక్కకు మళ్లిస్తున్న పోలీసులు



పోలీసుస్టేషన్‌లో ఇరువర్గాలతో చర్చిస్తున్న ఏఎస్పీ వెంకటరాముడు



ఆర్చరీలో జాతీయ స్థాయి పోటీల్లో పూర్వ విద్యార్థి రిషికిరణ్‌బాబు

రాష్ట్ర స్థాయి ఆర్చరీలో నెంబర్‌1

మూడేళ్లుగా రాష్ట్రస్థాయికి మున్సిపల్ హైస్కూలు ● స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్‌కు ఎంపిక

క్రీడా చరిత్రలో వరుసగా ర్యాంకుల పంట ● నేడు అవార్డుల ప్రదానోత్సవం

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 28: స్థానిక మున్సిపల్ హైస్కూల్ (మెయిన్) రాష్ట్రంలో మొదటి స్థానం కైవశం చేసుకుంది. మూడేళ్లగా రాష్ట్ర స్థాయికి ఎంపికవుతూ క్రీడా పురస్కారాలతో వరుస ర్యాంకుల పంట పండిస్తూ స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్‌కు ఎంపికైంది. ఎంతో ఘన చరిత్ర కలిగిన మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు చదువు, క్రీడల్లోనూ విశేష ప్రతిభ చాటుతూ జాతీయ క్రీడా దినోత్సవ పోటీల్లో 1040 పాయింట్లతో రాష్ట్రంలోనే నెంబర్‌వన్‌గా నిలిచింది. ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని ప్రతిభా అవార్డులు అందజేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2023 - 24 విద్యాసంవత్సరంలో క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలలకు రాష్ట్ర స్కూలు గేమ్స్ అవార్డులకు ఎంపిక చేస్తారు. ఈ నేపథ్యంలో కడప నగరం మున్సిపల్ హైస్కూలు మెయిన్ ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రతిభ పురస్కారానికి ఎంపికైంది.

కృషికి తగ్గ ఫలితం



మున్సిపల్‌హైస్కూలు మెయిన్ పాఠశాలకు బదిలీపై వచ్చి రెండేళ్ల పాఠశాల పరిస్థితులు అవగాహన చేసుకుని విద్యార్థుల్లో క్రమశిక్షణ, క్రీడల్లో ప్రోత్సహించా. 2014 నుంచి 22 రకాల ఆటల పోటీలపై వారిని ఉత్తేజపరిచి వారికనుగుణంగా ఆటలను నేర్పించాను. ఇప్పటి వరకు ఎందరో అంతర్జాతీయ, జాతీయ రాష్టస్థాయిలో పతకాలు సాధించారు. విద్యార్థులు పతకాలు సాధించడం పట్ల ఎంతో సంతోషంగా ఉంది. చేసిన కృషికి ఫలితం దక్కినట్లైంది.

- ఫిజికల్ డైరెక్టరు లక్ష్మిరెడ్డి వెంకటలక్ష్మి

వరుసగా ర్యాంకుల పంట

క్రీడా చరిత్రలో మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు వరుసగా ర్యాంకులు సాధిస్తూ తమదైన ముద్రను వేసుకున్నారు. 2014-15 విద్యాసంవత్సరం నుంచి జిల్లా స్థాయిలో క్రీడా ప్రతిభ పురస్కారాలకు ఎంపికవుతూనే ఉన్నారు. 2014 నుంచి ఏటా ప్రథమ స్థానంలో నిలుస్తూ సత్తా చాటుతున్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో వివిధ క్రీడల్లో అండర్14, అండర్ 17 విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ ఒక్క పాఠశాల నుంచే 202 మంది విద్యార్థులు పాల్గొనగా రాష్ట్రస్థాయిలో 53 పతకాలు, జాతీయ స్థాయిలో 6 పతకాలు సాధించి మొత్తం 59 పతకాలతో 1040 పాయింట్లతో రాష్ట్రంలోనే నెంబర్‌వన్‌గా నిలిచారు.

అవార్డుల పరంపర...

రాష్ట్రస్థాయి క్రీడా ఎక్సలెన్స్ అవార్డులను 2021-22 విద్యా సంవత్సరంలో ప్రారంభించారు. అయితే 2021-22, 2022-23 విద్యాసంవత్సరంలో వరుసగా రెండుసార్లు రాష్ట్ర స్థాయిలో మున్సిపల్ మెయిన్ పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచింది. 2023-24 విద్యాసంవత్సరంలో 1040 పాయింట్లు సాధించి రాష్ట్రస్థాయిలో మొదటిస్థానంలో నిలిచి సత్తాను చాటుకున్నారు. పాఠశాల విద్యార్థులు క్రీడలే కాకుండా సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా రాణించడం విశేషం. రాష్ట్రస్థాయి సింగింగ్, డ్యాన్సింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు.



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఫిజికల్ డైరెక్టర్ వెంకటలక్ష్మి

జిల్లాలో నెంబవర్ వన్....

జిల్లాలో 2023-24కు మున్సిపల్ హైస్కూలు మెయిన్ రాష్ట్రస్థాయిలో నెంబర్‌వన్‌గా నిలిచింది. జిల్లాలో వివిధ పాఠశాలల నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పాల్గొన్న క్రీడాకారులకు వచ్చిన పాయింట్ల ఆధారంగా క్రీడా ప్రతిభ అవార్డులను ప్రకటించారు. ఈ అవార్డులకు జిల్లా వ్యాప్తంగా 8 ఉన్నత పాఠశాలలు దరఖాస్తు చేసుకోగా, ఐదింటిని ఎంపిక చేశారు. ప్రథమ స్థానంలో కడప మున్సిపల్ హైస్కూలు మెయిన్ 1040 పాయింట్లతో నిలిచింది. ప్రొద్దుటూరు బీబీసీఎస్ మున్సిపల్ హైస్కూలు 174 పాయింట్లతో ద్వితీయ స్థానంలోనూ, 172 పాయింట్లతో మైదుకూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల తృతీయ స్థానంలో నిలిచింది చెన్నూరు మండలం రామనపల్లె జడ్పీ హైస్కూలు 146 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలవగా ఎర్రగుంట్ల జడ్పీహైస్కూలు 137 పాయింట్లలో ఐదో స్థానంలో నిలిచింది.

విద్యార్థుల కృషి అభినందనీయం



తమ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడం, వారు చేస్తున్న కృషి అభినందనీయం. వ్యాయామ ఉపాధ్యాయులు ఎంతో ప్రోత్సాహంతో పిల్లలకు ప్రోత్సహిస్తూ వారు క్రీడల్లో అభివృద్ధి పొందడానికి చేస్తున్న కృషి కూడా అభినందనీయము.

- ప్రధానోపాధ్యాయురాలు నాగమణి

నేడు ప్రదానోత్సవం

వైఎస్ఆర్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం థర్మల్ పవర్ ప్లాంటులో గురువారం ప్రతిభ పురస్కారాల బహుమతి ప్రదానోత్సవం నిర్వహించనున్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన పాఠశాలలకు మొమెంటోలు అందిస్తారు. అయితే రాష్ట్రస్థాయిలో బహుమతి ప్రదానోత్సవం ఎప్పుడు జరుగుతుందన్నది త్వరలో రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించనుంది.

గురుకులంలో పతకాల పంట

● ఒక స్వర్ణం, 12 కాంస్య పతకాలు

● రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ఓబులవారిపల్లె, ఆగస్టు 28: రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో సంజీవపురం గురుకుల పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మన్సూర్ అలీ తెలిపారు. తిరుపతి జిల్లా రేణిగుంట బాలికల హైస్కూల్‌లో ఆగస్టు 25, 26న జరిగిన కుస్తీ పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం విద్యార్థులు 16 మంది పాల్గొన్నారు. వీరిలో ఒకరు బంగారు పతకం సాధించగా 12 మంది కాంస్య పతకాలు సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు విజయనందమూర్తి, సురేంద్ర తెలిపారు. అనంతరం గురుకుల పాఠశాల ప్రాంగణలో విజేతలతో ప్రిన్సిపాల్ సమావేశమై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరులో జిల్లా స్థాయి యువజనోత్సవాలు

కడప (నాగరాజుపేట), ఆగస్టు 28: జిల్లాస్థాయి యువ జనోత్సవాలు స్టెప్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సాయిగ్రేస్ తెలిపారు. సెప్టెంబరులో నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా పలు అంశాల్లో పోటీలు జరుగుతాయని, ఆసక్తిగల 15 - 29 వయసు గల యువతీ యువకులు సంబంధిత పోటీల్లో పాల్గొనేందుకు సన్నద్ధం కావాలని కోరారు. థిమాటిక్ పోటీలు - సైన్స్ ప్రాజెక్టు థీం, ఇన్నోవేషన్ ఇన్ సైన్స్‌అండ్ టెక్నాలజీ, సాంస్కృతిక విభాగంలో జానపద నృత్యం (గ్రూప అండ్ సోలో), జానపద గేయం (గ్రూప్ అండ్ సోలో) ప్రత్యక్ష కార్యక్రమం, జీవిత నైపుణ్య విభాగంలో కవిత్వం, కథారచన, పెయింటింగ్, డిక్లమేషన్ వ్యవసాయోత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొంటారని, రాష్ట్ర స్థాయి విజేతలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు 9949298810, 9849497011 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

బెదిరింపులకు భయపడేది లేదు : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఆగస్టు 28: ఎవరి బెదిరింపులకు భయపడకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు పోతున్నామని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. బుధవారం ముద్దనూరు రోడ్డులోని రిపబ్లిక్ క్లబ్ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జమ్మలమడుగులో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు సమస్య లేకుండా చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఆస్పత్రి అభివృద్ధి ఏమాత్రం లేదన్నారు. కౌన్సిలర్ల బెదిరింపులకు తాము భయపడేది లేదని, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నేతలతో ఆయన మాట్లాడారు. టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి కార్యకర్తలతో మాట్లాడారు. కూటమి నేతలు గోనా పురుషోత్తంరెడ్డి, సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, నవనీశ్వర్‌రెడ్డి, కర్నాటి రామాంజనేయరెడ్డి, సర్పంచ్ పుల్లారెడ్డి, జనసేన నేతలు నాగార్జున, బాంబ్‌గుండం గౌస్‌మోద్దీన్, పోలీస్ చంద్ర, పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పందిరి వేస్తుండగా చోటు చేసుకున్న ప్రమాదం ● లైన్లు వేలాడుతూ వుండడమే కారణం

ప్రొద్దుటూరు, ఆగస్టు 28: కొత్తపల్లె పంచాయితీ అమృతనగర్‌లో ఓ ఇంటి వద్ద పందిరి వేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి బాబ్జాన్ (40) మృతిచెందాడు. అమృతనగర్ మదూరురోడ్డులోని మసీదు ఎదురుగా వున్న ఆశావర్కర్ శశికళ ఇంటి గృహప్రవేశానికి ఇంటిపైన పైపుల పందిరి వేస్తున్నారు. దీంతో ఇంటిని ఆనుకుని వున్న విద్యుత్ తీగలు తగలడంతో బాబ్జాన్ ప్రమాదం బారిన పడి తీవ్ర గాయాలపాలై మృతి చెందాడు. గృహప్రవేశం చేయనున్న ఇంటికి ఆనుకుని విద్యుత్ లైన్లు వుండడంతో ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు వివరించారు.

బాబ్జాన్ లక్ష్మీవెంకటేశ్వర సప్లయర్స్‌లో పనిచేస్తు న్నాడు. అతనికి తల్లి, భార్య హసీనా బాబాతోషిక్, మహ్మద్ రఫీ ఇద్దరు కొడుకులున్నారు. కూలి చేసుకుంటే తప్ప పూట గడవని కుటుంబం బాబ్జాన్‌దని ఇంటికి పెద్దగా ఆదరువుగా వుండే వ్యక్తి ఇలా అకాల మరణం చెందడం ఆ కుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. అమృతనగర్‌లో చాలా వీధుల్లో విద్యుత్ తీగలు ఇళ్లను ఆను కుని వుండడం ఇంటిపైన లైన్లు పోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇందువల్ల ప్రమాదాలు జరిగినా విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహిస్తున్నారు. బాబ్జాన్ కుటుంబానికి విద్యుత్ సంస్థ నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, కుటుంబీకులు

గంజాయి నిందితుల అరెస్టు

● 3050 గ్రాములు గంజాయి స్వాధీనం : అర్బన్ సీఐ లింగప్ప



గంజాయి సహా నిందితులతో సీఐ లింగప్ప, ఎస్ఐలు

జమ్మలమడుగు, ఆగస్టు 28: స్థానిక రైల్వేస్టేషన్ వద్ద నాగలకట్ట వెళ్లే దారిలో 27వ తేదీ సాయంత్రం గంజాయి నిందితులను అరెస్టు చేసినట్లు జమ్మలమడుగు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. బుధవారం సాయంత్రం జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో విలేకరులకు ఆయన నిందితుల వివరాలు వెల్లడిస్తూ అంది న సమాచారం మేరకు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఉత్తర్వుల మేరకు సిబ్బంది వెళ్లి దాడి చేశారన్నారు. పట్టుబడిన వారిలో నిందితులు నెల్లూరుజిల్లా ఉదయగిరి వాసి యాదగిరి వంశీకృష్ణ, ప్రొద్దుటూరులోని మత్స్యకాలనీ వాసి గొర్రె స్వర్ణేంద్రకుమార్, బొల్లవరం వీధికి చెందిన గాడెగూడూరు కల్యాణ్, హనుమాన్‌నగర్ వాసి వద్ది సాయిప్రసాద్, చౌడం వెంకటేష్, సానిక కోటవీధి వాసి ఆవుల అరవింద్, ధ్యానసుమంత్ టీకేఆర్ స్కూల్ వీధి, మరో ముగ్గురు బాలురు పట్టుబడినట్లు తెలిపారు. వారి నుంచి 3కిలోల 50 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు కొంత కాలంగా గంజాయికి బానిసై కిలో రూ.12 వేలకు కొనుగోలు చేసి ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాల్లోని కల్యాణ్, స్వర్ణేంద్రకుమార్, సాయిప్రసాద్, వెంకటేష్‌కు విక్రయించేవారన్నారు. గంజాయిని అరవింద్, సుమంత్, మరో ముగ్గురు బాలురు కలిసి రూ.16 వేలకు విక్రయించేవారని విచారణలో తేలినట్లు సీఐ తెలిపారు. నిందితులను కోర్టు రిమాండ్‌కు ఆదేశించిందని సీఐ తెలిపారు.

భవిష్యత్ మార్గదర్శకులు ఆంగ్ల ఉపాధ్యాయులు


వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 28: గ్రామీణ విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు పెంపొందించ గలిగితే ప్రపంచ పోటీలో దీటుగా నిలబడతారని ఆ దిశగా ఆంగ్లభాష ఉపాధ్యాయులు కృషి చేయాలని వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి తెలిపారు. వైవీయూ ఆంగ్లశాఖ ఆధ్వర్యంలో ఆంగ్ల భాష నైపుణ్యాలు, ఉన్నత పాఠశాల స్థాయిలో బోధనా విధానాలపై యూనివర్శిటీలో సమన్వయకర్త డాక్టర్ ఆర్‌వీ జయంత్ కాశ్యప్ ఆధ్వర్యంలో కార్యశాల నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆంగ్లభాషా ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు చిన్న చిన్న పదాలతో ప్రారంభించి ఆంగ్లభాష పట్ల ఆసక్తి పెంచాలన్నారు. హైదరాబాద్ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజ్ యూనివర్శిటీ రిజిస్ట్రారు ప్రొఫెసరు నరసింహారావు మాట్లాడుతూ ఆంగ్లభాష ఉపాధ్యాయులు బోధనా సామర్థ్యాలు పెంచుకోవాలన్నారు. వైవీయూ రిజిస్ట్రారు ప్రొఫెసరు రఘునాథరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ ప్రొఫెసరు పద్మ మాట్లాడారు. కార్యక్రమంలో ఆంగ్లశాఖ బోర్డ్ ఆఫ్ ఛైర్మన్ అంకన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

తెలుగును అవమానిస్తున్న అధికార భాషా శాఖ : ఏఐవైఎఫ్



లేఖను చూపిస్తున్న గంగాసురేశ్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 28: సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం అధికార భాషా శాఖ వారిని తెలుగులో సమాచారం కోరితే హిందీ, ఇంగ్లీషులో సమాచారం అడగాలనడం రాజ్యాంగ విరుద్ధ మని, ఇది తెలుగును అవమానించడమేనని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాసురేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. హోచిమన్‌భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారత రాజ్యాంగం 8వ షెడ్యూలులో 22 భాషలను అధికారికంగా గుర్తించిందన్నారు. ఈ భాషల్లో భారత ప్రభుత్వ కార్యకలాపాల వివరాలు అడిగి తెలుసుకునే హక్కు సమాచార హక్కు చట్టం కల్పించిందన్నారు. సమాచార హ క్కు చట్టం ప్రకారం తెలుగుభాషలో సమాచారం తెలపాలని కోరగా, హిందీ, లేదా ఇంగ్లీషులో అడగాలనడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాషా అభిమానులు స్పందించాలని కోరారు.

బీఎడ్ పరీక్ష కేంద్రాల తనిఖీ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 28: వైవీయూ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి కడప నగరంలో బీఎడ్ పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఆటంకం కలగకుండా ప్రశాంతంగా పరీక్షలు జరగడానికి జాగ్రత్తలు తీసుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్లకు సూచించారు. వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

1న ఇడుపులపాయకు వైఎస్ షర్మిల రాక

వేంపల్లె, ఆగస్టు 28: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సెప్టెంబరు 1న ఇడుపులపాయ రానున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. 1న హైదరాబాదు నుంచి బయలుదేరి సాయంత్రం 5గంటలకు ఇడుపులపాయ చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస చేసి 2న వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్సార్ ఘాట్‌లో నివాళులర్పించనున్నారు. 2, 3 తేదీల్లో జిల్లాలోనే అందుబాటులో ఉంటారని 4న షర్మిల తిరిగి వెళతారని తెలిపాయి.

మట్టి విగ్రహాలనే పూజించండి

కడప(కలెక్టరేట్), ఆగస్టు 28: ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని, శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు శాంతి కమిటీ సభ్యులు సహకరించాలని కలెక్టర్ శివశంకర్ పిలుపు నిచ్చారు. జిల్లాలో గణేశ్ ఉత్సవాల నిర్వహణపై బుధవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో శాంతి కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా మత సామరస్యానికి ప్రసిద్ధి అన్నారు. అన్నిమతాల ప్రజల సహకారంతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గణేశ్ ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ అదితిసింగ్, డీఆర్వో పాల్గొన్నారు.

ఆక్రమిత భూములు స్వాధీనం



ప్రభుత్వ భూమిలో సాగు చేసిన పంటను తొలగిస్తున్న రెవెన్యూ యంత్రాంగం

సిద్దవటం, ఆగస్టు 28: ప్రభుత్వ భూమిని ఆక్రమించి పసుపు పంట సాగు చేస్తున్న రైతు నుంచి రెవెన్యూ అధికారులు భూమిని స్వాధీనం చేసుకున్నారు. పెద్దపల్లి రెవెన్యూ మందపల్లి గ్రామ పొలంలో సర్వేనంబరు 29/10లో 0.70 ప్రభుత్వ భూమిని బాకరాపేట వాసి ఒకరు ఆక్రమించి పసుపు సాగు చేశాడు. ప్రజల ఫిర్యాదుపై స్పందించిన జేసీ ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేయడంతో రంగంలోకి దిగిన రెవెన్యూ యంత్రాంగం ఎక్స్‌కవేటర్‌తో పూర్తిగా చదును చేసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. వీఆర్వో నాని మాట్లాడుతూ ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

జమ్మలమడుగు, ఆగస్టు 28: పెన్నానది పరిసర ప్రాంతాల నుంచి అక్రమంగా తరలించే ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్లను అర్బన్ పోలీసు స్టేషన్ ఆవరణలో పెట్టారు. మొత్తం 8 ఇసుక ట్రాక్టర్లు ఉన్నాయి.

సిమెంటు రోడ్డు పనులకు బిల్లుల మంజూరు

వేంపల్లె, ఆగస్టు 28 : వేంపల్లె పట్టణంలోని ప్రధాన రోడ్లపై గత ప్రభుత్వంలో నిర్మించిన సిమెంటు రోడ్డు, మురుగుకాల్వల నిర్మాణానికి సంబంధించి పాత బకాయి బిల్లులు రూ.7 కోట్లను సీఎం చంద్ర బాబునాయుడు విడుదల చేశారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఇటీవల వేంపల్లెలో పెండింగులో ఉన్న రోడ్డు పనులు తిరిగి ప్రారంభించేందుకు కాంట్రాక్టర్లకు బిల్లులు ఇస్తే తిరిగి పనులు ప్రారంభిస్తారని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సీఎం సానుకూలంగా స్పందించి నిధులు విడుదల చేశారు. సెప్టెంబరు 1 తరువాత పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని మాజీ ఎంపీటీసీ సభ్యుడు జీవీ రమణ తెలిపారు. ఎమ్మెల్సీ చొరవతో బిల్లులు రావడంతో పజలు హర్షం వెలిబుచ్చారు.

దివ్యాంగుల జీవితాలకు వెలుగులద్దిన మందకృష్ణ

కడప (మారుతీనగర్), ఆగస్టు 28: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ దివ్యాంగుల జీవితాలకు వెలుగులద్దారని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు పేర్కొన్నారు. వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మహావీర్ సర్కిల్ వద్ద కేక్ కట్ చేసి జెండా ఆవిష్కరించారు. వీహెచ్‌పీఎస్ నాయకులు చిన్నసుబ్బయ్య, అంజనేయులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు ఎం.వెంకటేష్, ఎంఎస్‌పీ నాయకులు మాతయ్య, సుమన్‌కుమార్, లలితమ్మ, ప్రేమలత, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

మేయర్ ఇంట్లో చెత్త వేయడం సరికాదు

● ఎస్పీకి ఫిర్యాదు చేసిన వైసీపీ నాయకులు

కడప (క్రైం), ఆగస్టు 28 : కడప నగర మేయర్ సురేశ్‌బాబు ఇంట్లో చెత్త వేయడం మంచి పద్ధతి కాదని, చెత్త వేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి కోరారు. బుధవారం ఆయన వైసీపీ నాయకులతో కలిసి ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మేయర్ ఇంటిపై ఎమ్మెల్యే మాధవీరెడ్డి చెత్త వేయించిందని ఆరోపించారు. చెత్త నిర్వహణ అనేది మున్సిపల్, కార్పొరేషన్‌దే అన్నారు. చెత్త యూజర్‌చార్జీలపై జీఓ విడుదల చేయలేదన్నారు. ఎమ్మెల్యే మాధవి చంద్రబాబుతో మాట్లాడి నిధులు తీసుకుని వచ్చి ప్రజలకు మేలు చేయాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదన్నారు.మేయర్ సురేశ్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా, రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

'స్మార్ట్ మీటర్లు రద్దు చేయకపోతే పోరాటానికి సిద్ధం'

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 28 : స్మార్ట్ మీటర్లు రద్దు చేయకపోతే పోరాటానికి సిద్ధమని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ హెచ్చరించారు. బుధవారం వామపక్షాల ఆధ్వర్యంలో కడప నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ఆ నాటి బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమంలో అమరులైన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ మాట్లాడారు. బషీర్‌బాగ్ కాల్పుల ఘటనలో వామపక్ష పార్టీల నాయకులు రామక్రిష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామిలను నాటి ప్రభుత్వం పొట్టనపెట్టుకుందన్నారు. అప్పటి నుంచి కరెంటు చార్జీలు పెంచాలంటే ప్రభుత్వాలు భయపడేవన్నారు. ప్రస్తుతం వ్యవసాయ పంపు సెట్లకు, ఇళ్లకు విద్యుత్ స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రామ్మోహన్, మనోహర్, ఐఎన్ సుబ్బమ్మ పాల్గొన్నారు.

'వీణా అజయ్‌కుమార్ సేవలు మరువలేనివి'

కడప (ఎన్టీఆర్ సర్కిల్), ఆగస్టు 28 : ప్రముఖ న్యాయవాది స్వర్గీయ వీణా అజయ్‌కుమార్ సేవలు మరువలేనివని, ఆయన సంఘ సేవకు ఎప్పుడూ తపించేవాడని డీఆర్‌డీఏ అదనపు పథక సంచాలకులు ప్రసాద్ పేర్కొన్నారు. వీణా అజయ్‌కుమార్ 63వ జయంతి ఉత్సవాలను ఆయన కుటుంబ సభ్యులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కడప నగరంలోని భవిత మానసిక వికలాంగుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పారిశ్రామికవేత్త అమర్, వీణా అజయ్‌కుమార్ కుటుంబ సభ్యులు, ఆయన మిత్రులు, అభిమానులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె మండలంలో కమిషనర్ పర్యటన

సీకేదిన్నె, ఆగస్టు 28: కడప కమిషనర్ నందన్ కార్పొరేషన్‌లో విలీనమైన చింతకొమ్మదిన్నె మండలంలోని 16, 17 డివిజన్లలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు కమిషనర్‌కు స్థానిక సమస్యలను వివరించారు. కాలువలు, రోడ్ల అభివృద్ధి చేయాలని ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ప్రతి ఒక్కరూ లైసెన్సులు కలిగి ఉండాలి: ఎస్ఐ

కమలాపురం రూరల్, ఆగస్టు 28 : ప్రతి వాహనదారుడూ లైసెన్సు కలిగి ఉండాలని ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ఆర్ఎస్ రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. లైసెన్స్ ఎలిమెంట్ తదితర రికార్డులు పరిశీలించారు. లైసెన్సులు కలిగి ఉంటే ఏదైనా ప్రమాదం జరిగితే ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందుతాయన్నారు. లేదంటే కుటుంబ సభ్యులు ఇబ్బందులుపడతారన్నారు.

ఖాళీలను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలి

కడప (సెవెన్‌రోడ్స్), ఆగస్టు 28: రాష్ట్రంలో 476 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. బుధవారం స్థానిక జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కళాశాలల పరిస్థితి రోజురోజుకూ అధ్వానంగా మారుతోందన్నారు. పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకనుగుణంగా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర కన్వీనరు విజయ్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో ఉద్యోగానికి 16 మంది ఎంపిక

కడప (మారుతీనగర్), ఆగస్టు 28: కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో బుధవారం జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 16 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రధానాచార్యుడు డాక్టర్ రవీంద్రనాథ్, జేకేసీ కో ఆర్డినేటర్ సీహెచ్ రాము తెలిపారు. కార్యక్రమంలో జేకేసీ మెంటార్లు రవీంద్రారెడ్డి, ఎస్.సారథి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

సీకేదిన్నె, ఆగస్టు 28: చింతకొమ్మదిన్నె మండలం ఆజాద్‌నగర్‌లోని బృంద వృద్ధాశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెదురూరు బాబు తెలిపారు. వెదురూరు వెంకటసుబ్బమ్మ, లక్ష్మి దంపతుల కుమారుడు ఏసోసు పుట్టిన రోజు సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేసి అక్కడే పుట్టిన రోజును జరుపుకున్నారు.

జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలి


సైఫోత్రిన్ పిచికారీని పరిశీలిస్తున్న సిద్ధయ్య

సింహాద్రిపురం, ఆగస్టు 28: జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలని మలేరియా సబ్-యూనిట్ అధికారి సిద్ధయ్య పేర్కొన్నారు. శుక్రవారంలో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించి ప్రజలకు మలేరియా, డెంగ్యూ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్నీ సందర్శించి జ్వరం వచ్చిన వారికి రక్తపూతలు సేకరించి వారానికి మూడుసార్లు ల్యాబ్‌కు అందజేయాలన్నారు. మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించాలన్నారు.

అర్చక స్వాముల జీతాల పెంపు అభినందనీయం

కడప (కల్చరల్)/ఎడ్యుకేషన్, ఆగస్టు 28: రాష్ట్ర ప్రభుత్వం హిందూ దేవాలయాల అభివృద్ధి, అర్చక స్వాముల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని 10వేల వేతనం అందే అర్చక స్వాములకు ఇకపై రూ.15 వేలకు పెంచడం అభినందనీయమని ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సత్యనారాయణశర్మ, వారణాసి శ్రీధర్ శర్మ, గౌరవాధ్యక్షుడు చంద్రమౌళి శర్మ పేర్కొన్నారు.

అర్చకులకు ఆసరా హర్షణీయం

సీఎం చంద్రబాబు బ్రాహ్మణ సంక్షేమం, అర్చక సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయాలు హర్షణీయమని బ్రాహ్మణ సాధికార కమిటీ జిల్లా కన్వీనరు జనార్ధన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిందూ దేవాలయాల ఆస్తుల పరిరక్షణ కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయడం శుభపరిణామన్నారు.

స్వచ్ఛ కడప లక్ష్యం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 28 : స్వచ్ఛ కడప లక్ష్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండురోజులుగా కడప నగరంలో జరుగుతున్న చెత్తసేకరణపై వివాదానికి సంబంధించి ఆయన వివరణ ఇస్తూ.. మేయరు ఇంటిపై చెత్తను వేసి నిరసన తెలిపిన వారిలో స్థానిక ప్రజలు, టీడీపీ శ్రేణులు ఉన్నారని తెలిపారు. తాము ఎవరం ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహించడం లేదని పేర్కొన్నారు. ప్రజలు ఇలా చేయడానికి బాధ్యులెవరని ప్రశ్నించారు. ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే దురుద్దేశ్యంతో చెత్త సేకరణ నిలిపవేశారని ఆరోపించారు. తమ లక్ష్యం స్వచ్ఛ కడప, శాంతి కడప అని.. ఇందుకోసం తమతో కలిసి వచ్చే ప్రతి ఒక్కరినీ రాజకీయాలకతీతంగా కలుపుకుని ముందుకు వెళతామని స్పష్టం చేశారు.

'ట్రంకు రోడ్డులో ఆక్రమణలు తొలగించాల్సిందే'

చెన్నూరు, ఆగస్టు 28 : చెన్నూరు ట్రంకురోడ్డుకు ఇరువైపులా రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న దుకాణాలను పూర్తిగా తొలగించాలని ఏఎస్పీ వెంకటరాముడికి ఆలయ కమిటీ సభ్యుడు గంగసాని శివారెడ్డి విన్నవించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆక్రమణల వల్ల మహిళలు సైతం ఈ దారిలో నడవాలంటే ఇబ్బందులు పడుతున్నారన్నారు.

చంద్రబాబుతోనే నాయీబ్రాహ్మణులకు న్యాయం


మాట్లాడుతున్న రంగయ్య

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 28: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబుతోనే నాయీ బ్రాహ్మణులకు న్యాయం జరుగుతుందని వాయిద్యకళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య తెలిపారు. బుధవారం చిన్నచౌకులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆలయాల్లో ఉండే వాయిద్యకళాకారులకు రూ.25వేలు వేతనం ఇవ్వాలి నిర్ణయించడం అభినందించదగ్గ విషయమన్నారు. నాయీబ్రాహ్మణలకు మేలు చేస్తే గుండెల్లో పెట్టుకుంటారన్నారు. అలాగే గురువారం కడప ఎమ్మెల్యే మాధవి జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. వాయిద్యకళాకారులు సంఘం ప్రతినిధులు వెంకటసుబ్బయ్య, సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

కడప (క్రైం), ఆగస్టు 28: కడప నగరం రామక్రిష్ణనగర్‌లో జూదమాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. జూదమాడుతున్నట్లు సమాచారం రావడంతో అక్కడికెళ్లి అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.10 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

'నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి'


ఈడీకు వినతిపత్రం అందిస్తున్న పీఆర్ఎస్ వైఎఫ్ కన్వీనర్ శంకర్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 28:ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జిల్లాకు మంజూరైన ఆటోలు, ట్రాక్టర్లను అర్హులైన నిరుద్యోగ యువతకు పంపిణీ చేయాలని పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనరు శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో పీఓ రవీంద్రనాథరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో స్వచ్ఛ సంకల్ప కార్యక్రమాన్ని మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మెకనైజ్డ్ డ్రయిన్ క్లీనింగ్ కోసం ఎస్సీ ఆర్థిక అభివృద్ధి సంస్థ నిధుల నుంచి జిల్లాకు ఆటోలు, ట్రాక్టర్లు, స్ప్రేయింమిషన్లు మంజూరు చేసిందన్నారు. అయితే వీటిలో కొన్నింటికి మాత్రమే పంపిణీ చేసి మిగిలిన వాటిని కడప నగరం మహిళా ప్రాంగణంలో ఉంచారని, వీటిని అర్హులైన వారికి పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనరు ఓరుగంటి నాగేంద్రబాబు, నాయకులు శ్రీనాధ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి కళలు ఉత్తమ మార్గాలు


ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న వైవీయూ వీసీ, రిజిస్ట్రారు తదితరులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 28 : మానవ మేధస్సుకు మానసిక వికాసానికి కళలు ముఖ్యమని వైవీయూ వైస్‌చాన్సలర్ క్రిష్టారెడ్డి అన్నారు. బుధవారం వైవీయూ ఫైన్‌ఆర్ట్స్‌శాఖ పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ఆయనతో పాటు రిజిస్ట్రారు ప్రొఫెసరు రఘునాథరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు కలిసి ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. చిత్రకళ అబ్బురపరుస్తోందన్నారు. రిజిస్ట్రారు రఘునాథరెడ్డి మాట్లాడుతూ చిత్రాలు ఆలోచింపజేసేవిగా ఉన్నాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

కడప(క్రైం) ఆగస్టు 28: కడప నగరం దేవునికడప ఆర్చీ సమీపంలోని బైపాస్ రోడ్డుపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందినట్లు చిన్నచౌక్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. చెన్నూరు మండలం నజీర్‌బేగ్ పల్లెకు చెందిన ప్రసాద్(35) ఆటో తోలుకుంటూ జీవనం సాగించే వాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఆటోలో ఇంటికి వెళుతుండగా చెన్నూరు నుంచి రాజంపేట వైపునకు వెళుతున్న ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో ప్రసాద్ దుర్మరణం చెందారు. పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

కమలాపురం రూరల్, ఆగస్టు 28 : తెలుగుభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం గిడుగు రామమూర్తి పంతులు జయంతి రోజును తెలుగుభాషా దినోత్సవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్రసాహిత్య అకాడమీ బాల పురస్కార గ్రహీత డీకే చదువుల బాబు హాజరయ్యారు. ఆయన మొదట తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నమస్కరించారు. అనంతరం గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలుగు భాష మన సంస్కృతి, సాంప్రదాయాలను చాటి చెప్పడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. తెలుగు సాహితీ సంపదను కాపాడుకోవడం మన బాధ్యత అన్నారు. అనంతరం తెలుగు అధ్యాపకుడు డాక్టర్ పల్లాక్రిష్ణ మాట్లాడారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి




జమ్మలమడుగు ఆర్టీసీ గేటు వద్ద ఎన్ఎంయూ కార్మికుల నిరసన, మైదుకూరులో ఎర్రబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

జమ్మలమడుగు, ఆగస్టు 28: జమ్మలమడుగు ఆర్టీసీ డిపో గ్యారేజీ ఎదుట బుధవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి శివుడు, అధ్యక్షుడు పుత్తా బ్రహ్మం మాట్లాడుతూ ఆర్టీసీలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కడప రీజియన్ పరిధిలో కార్మికుల సమస్యలను యాజమాన్యం ప్రభుత్వం స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కడప డీపీటీవో నిరంకుశ వైఖరి నశించాలన్నారు. అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలని, ఉద్యోగులపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రీజినల్ కమిటీ మెంబర్ శ్రీనివాసులు, గ్యారేజీ సిబ్బంది, ఎన్ఎంయూ కార్మికులు, కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్...: జీఎస్ కమిటీ పిలుపు మేరకు బుధవారం ఆర్‌టీసీ డిపోలో ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నేషనల్ మజ్దూర్ యూనియన్ రీజనల్ చైర్మన్ రాయుడు మాట్లాడుతూ ఉద్యోగుల పరిష్కారానికి, అధికారుల మొండి వైఖరికి నిరసనగా చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు నాగరాజు,డిపో సెక్రటరీ రెడ్డి,అడిషనల్ సెక్రటరీ కుళాయప్ప పాల్గొన్నారు.

అనారోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మారిన రాష్ట్రం

కాంగ్రెస్ నేత ఎన్.తులసిరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 28: అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పాలనపై దృష్టి పెట్టకపోవడంతో రాష్ట్రం అనారోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మారిందని పీసీసీ మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు మలేరియా, చికెన్‌గున్యా, డెంగ్యూ జ్వరాలతో అవస్థ పడుతున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం శక్తికి మించి అప్పులు చేసి రాష్ట్రాన్ని రుణ ఆంధ్రప్రదేశ్‌గా మార్చవద్దని సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు జిలానీబాష, రామాంజనేయులు, రఫీ, ఖలందర్, సుబ్బరాయుడు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్ ఎస్ఐగా శ్రీకాంత్



బద్వేలు రూరల్, ఆగస్టు 28 : బద్వేలు రూరల్ ఎస్ఐగా శ్రీకాంత్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన చిత్తూరు జిల్లా శ్రీసిటీలో ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై బద్వేలు రూరల్ స్టేషన్‌కు వచ్చారు. రూరల్‌పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు.

ఘనంగా వరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠ



జమ్మలమడుగు, ఆగస్టు 28: జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామం చలంగారివీధిలో బుధవారం వరసిద్ధి వినాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ఈనెల 26వ తేదీ సోమవారం నుంచి విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి.కాగా28వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. మోరగుడి, దొమ్మరనంద్యాల, వేపరాల, చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేషంగా పాల్గొని పూజలు చేసి మొక్కుకున్నారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా పట్టాభిరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ,కల్యాణం



గోపవరం, ఆగస్టు 28 : గోపవరం మండలం చెన్నవరం గ్రామంలో వెలసిన పట్టాభిరామస్వామి దేవాలయంలో మూడోరోజు స్వామివారి ధ్వజ,మూలవిరాట్ ప్రతిష్ఠ తదుపరి స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పలువురు ప్రముఖులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తిరువెంగలాపురంలో శ్రీకృష్ణుని ఊరేగింపు



పోరుమామిళ్ల, ఆగస్టు 28 : మండలంలోని తిరువెంగలాపురంలో శ్రీకృష్ణుని ప్రతిమను ఊరేగించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక తాడిపత్రి కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని ప్రతిమను ఈ నెల 26న తిరువెంగలాపురంలో గుడి వద్ద వేదిక నిర్మించి కొలువుదీర్చారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం జ్ఞానరీత్యానిత్య పూజలు, భగవద్గీత పారాయణం చేశారు. మూడోరోజు బుధవారం శ్రీకృష్ణుని ప్రతిమను పురవీధుల్లో ఊరేగించారు.

'అక్రమ కట్టడాలకు అనుమతులిచ్చి టీడీపీకి అంటగడతారా..?'



మాట్లాడుతున్న పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి

ప్రొద్దుటూరు , ఆగస్టు 28 : సూపర్ బజార్ వీధి లోని అక్రమ షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మాణానికి 2018లో అప్పటి టీడీపీ మున్సిపల్ పాలక మండలి అనుమతిఇచ్చిందని వైసీపీ కౌన్సిలరు గరిశపాటి లక్ష్మీదేవి ఆరోపించడంపై టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2018లో ప్లానుకు పెట్టుకుంటే టీడీపీ పాలకమండలి అనుమతించలేదన్నారు. ఆ ప్లానును 2020 లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక అనుమతి ఇచ్చిందన్నారు. అంతేకాకుండా ఈ ఐదేళ్లలో ఆ కట్టడం పూర్తిగా ప్లానుకు విరుద్ధంగా అక్రమంగా నిర్మించడానికి కారకులు ఏసీపీ మునిరత్నం అన్నారు. ఆయనకు మద్దతు ఇచ్చిన అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మెన్ బంగారురెడ్డి అన్నారు. దాదాపు 40 నుంచి 50 వరకు భారీ కట్టడాలకు అక్రమంగా అనుమతులిచ్చారన్నారు. సమావేశంలో టౌన్‌బ్యాంకు చైర్మెన్ బొగ్గుల సుబ్బారెడ్డి, చెన్నయ్య పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఖాజీపేట, ఆగస్టు 28: అక్రమంగా పెన్నానది నది నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆమేరకు పోలీసులు దాడి చేయగా ఓ ట్రాక్టర్ పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్లితే... బుధవారం రాబడిన సమాచారం మేరకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆమేరకు దాడి చేయగా ఖాజీపేట సమీపంలో తుడమలదిన్నె గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించుకోవాలి

బద్వేలు, ఆగస్టు 28: మూఢనమ్మకాలనుంచి ప్రజలను విముక్తి కల్పించడంలో ప్రతి కార్యకర్త శాస్త్రీయ అవగాహన పెంపొందించుకుని ప్రజలను చైతన్యవంతులను చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం ఆధ్వర్యంలో కార్యకర్తలకు రెండు రోజుల పాటు శాస్త్రీయ , రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీను, చిన్ని, కె.శివకుమార్, బాలమ్మ, రామలక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల వివరాలు ఆన్‌లైన్‌లో తప్పక నమోదుచేయాలి



మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

కాశినాయన ఆగస్టు28: ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులు,బాలింతలకు అందిస్తున్న సేవలను వారి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో తప్పక నమోదుచేయాలని జిల్లా స్టాటికల్ ఆఫీసర్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కొండ్రాజుపల్లె సచివాలయంలోని విలేజ్‌క్లీనిక్ సెంటర్, నర్సాపురం ప్రభుత్వ ప్రాధమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈకార్యక్మరంలో ఏఎస్‌వో జాకబ్, డేటాఎంట్రీ అధికారి నారాయణ, మండల వైద్యులు ప్రశాంతి,జయరాం ఇతర అధికారులు వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగునీటి కంపు



రోడ్డుపై చేరిన మురుగు నీరు

జమ్మలమడుగు, ఆగస్టు 28: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని పెద్దపసుపుల మోటు నుంచి ప్రభుత్వ పశువుల ఆస్పత్రి వెళ్లే దారిలో కంపుకొడుతోంది. ఆ రోడ్డులో డ్రైనేజీ కాలువ, దెబ్బతిని మురుగునీరు రోడ్డుపై చేరుతోంది. దీంతో ఆ రోడ్డున వెళ్లే ద్విచక్ర వాహనదారులకు, స్థానికులకు మురుగు కంపుకొడుతోంది. మున్సిపల్ అధికారులు వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'చేనేతల ఉపాధికి గండికొట్టిన ప్రభుత్వాలు'

ప్రొద్దుటూరు, ఆగస్టు 28 : చేనేతల ఉపాధి కోసం వారి ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడం కోసం ఏర్పాటు చేయదలిచిన అపెరల్ పార్కు భూములను గత ప్రభుత్వాలు పక్కదారి పట్టించి చేనేత ఉపాధికి గండి కొట్టాయని ప్రజా పక్షం అధ్యక్షుడు న్యాయవాది పుత్తా లక్ష్మీరెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద అపెరల్ పార్కు స్థలాలను ఎంబజీ ప్లాట్లుగా వేసి విక్రయించి సొమ్ము చేసుకున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఎండగడుతూ ధర్నా చేశారు. అనంతరం డిప్యూటి తహసీల్దారు సాయినాధరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రెహమాన్, వెంకటపతి, షర్మిల, దివ్యశ్రీ, నాగలక్ష్మి, హరిప్రసాద్ సుజాత, ఓబులరెడ్డి పాల్గొన్నారు.

కోరం లేక కౌన్సిల్ సమావేశం రద్దు



సభాభవనంలో కౌన్సిలర్లు లేక ఖాళీ కుర్చీలు

జమ్మలమడుగు, ఆగస్టు 28: జమ్మలమడుగు మున్సిపల్ అత్యవసర సమావేశం బుధవారం రద్దు అయింది. కమిషనర్ ప్రమోద్‌కుమార్ మున్సిపల్ అత్యవసర సమావేశం బుధవారం ఉదయం 11.30 గంటలకు ఏర్పాటు చేసినట్లు కౌన్సిలర్లకు సమాచారం తెలియజేశారు. ఈ సమావేశానికి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి హాజరవుతున్నారని వైసీపీ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. అధికారులు ఛైర్‌పర్సన్ శివమ్మ, మరో ముగ్గురు కౌన్సిలర్లు ఒక కో-ఆప్షన్ మెంబర్ మధ్యాహ్నం 12.50 గంటల వరకు వేచి చూశారు. ఎవ్వరు రాకపోవడంతో కోరం లేక సమావేశం రద్దు చేసినట్లు ఛైర్‌పర్సన్ శివమ్మ విలేకరులకు తెలిపారు. అయితే హాజరైన కౌన్సిలర్లు న్యాయవాది మునిసుబ్బారెడ్డి, పోలీసు లలిత, బాణాశివరామలింగారెడ్డి మాట్లాడారు. అయితే సమావేశానికి కోరం లేకపోవడంతో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సమావేశానికి హాజరుకాకుండా నేరుగా జమ్మలమడుగులోని ముద్దనూరు రోడ్డులో రిపబ్లిక్ క్లబ్ ఆవరణంలో వెళ్లడం జరిగింది. ఈసమావేశానికి కౌన్సిలర్లు మునిసుబ్బారెడ్డి, బాణాశివరామలింగారెడ్డి, పోలీసు లలిత, కోఆప్షన్ మెంబర్ ఫయాజ్ బాషలతోపాటు అధికారులు కమిషనర్ ప్రమోద్‌కుమార్, వారి సిబ్బంది హాజరయ్యారు.

ఇసుక కోసం బారులు తీరిన వాహనాలు



కొండాపురం, ఆగస్టు 28: మండలంలోని ఏటూరు ఇసుక రీచ్ వద్ద ఇసుక కోసం వాహ నాలు బారులు తీరుతున్నాయి. టిప్పర్లు, ట్రాక్టర్లు ఉదయం నుంచే ఇసుకరీచ్‌ల వద్ద కు తరలి వస్తున్నాయి. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక కూపన్లు ఇస్తున్నట్లు ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. సచివాలయం వద్దకు వెళ్లి కూపన్లకు ఇన్ వాయిస్ బిల్లు ఇచ్చి, చెక్‌పోస్టుల వద్ద తనిఖీ చేసిన తర్వాతే వాహనాలను పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా ఇసుకను సరఫరా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏటూరు ఇసుకరీచ్ వద్ద నాణ్యమైన ఇసుక ఉండటంతో ఈ రీచ్ వద్దకు పెద్ద ఎత్తున ఇసుక కోసం వస్తున్నారు.

జూదరుల అరెస్టు

ఖాజీపేట, ఆగస్టు 28: కడప-కర్నూలు జాతీయ రహదారిలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్లితే బుధవారం టీటీడీ కల్యాణ మండపం సమీపంలో బి.కోడూరు మండలానికి చెందినవారు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి రూ.1770 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రామ్మోహననాయుడును కలిసిన సర్పంచ్



పోరుమామిళ్ల, ఆగస్టు 28 : లోక్‌సభ సభ్యుడు కింజారపు రామ్మోహన్‌నాయుడును పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలో ఆయనను కలిసి కడప, విజయవాడకు విమాన సౌకర్యం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆయన తెలిపారు.

మానసిక వికాసానికి కళలు ఉత్తమ మార్గాలు



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న వీసీ, రిజిస్ట్రారు తదితరులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 28 : మానవ మేధస్సుకు మానసిక వికాసానికి కళలు ముఖ్యమని వైవీయూ వైస్ చాన్సలర్ క్రిష్ణారెడ్డి అన్నారు. బుధవారం వైవీయూ ఫైన్‌ఆర్ట్స్‌శాఖ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ఆయనతో పాటు రిజిస్ట్రారు ప్రొఫెసరు రఘునాథరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ పూర్వవిద్యార్థులు కలిసి ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. చిత్రకళ అబ్బురపరుస్తోందన్నారు. రిజిస్ట్రారు రఘునాథరెడ్డి మాట్లాడుతూ చిత్రాలు ఆలోచింపజేసేవిగా ఉన్నాయన్నారు.

రేపు హిందీ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఇంటర్వ్యూ

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 28: స్థానిక ఎస్‌సీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు హిందీ సబ్జెక్టు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ జి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ హిందీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైనవారు ఇంటర్వ్యూకు సర్టిఫికెట్లతో రావాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

అట్లూరు, ఆగస్టు 28 : అట్లూరు మండల సాధారణ సర్వసభ్యసమావేశం ఎంపీపీ పొత్తపి రమాదేవి అధ్యక్షతన శుక్రవారం స్త్రీశక్తి భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుజాతమ్మ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అందరూ హాజరు కావాలన్నారు. మండల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆమె తెలిపారు.

1న జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 28: అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో సెప్టెంబరు 1వ తేదీ ఉదయం 9.30 గంటలకు జిల్లాస్థాయి అథ్లెటిక్‌పోటీలు నిర్వహిస్తున్నట్లు బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ కార్యదర్శి అహమర్‌బాష తెలిపారు. అండర్-18, 20, 23 విభాగంలో స్త్రీ, పురుషులకు 100, 200, 400, 1000 మీటర్లు రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, డిస్కత్రో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులు సెప్టెంబరులో గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు. జిల్లాలోని క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనాలని ఇతర వివరాలకు 9949686586 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఒకటిన నిరసనలు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 28: పాత పెన్షన్ విధానం అమలు చేయాలని సెప్టెంబరు 1వ తేదీ పాత తాలూకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో ఏపీటీఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, మునివర్ధన్‌కుమార్, అప్సర్‌పాషా, కొండారెడ్డి, మోహన్‌రెడ్డి, సుబ్బయ్య, సయ్యద్‌బాష, నరసింహకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ

డ్రైవర్‌కు గాయాలు

కొండాపురం, ఆగస్టు 28 : మండలంలోని పెంజి అనంతపురం సర్కిల్ వద్ద బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఒక కంటెయినర్ లారీ , మరొక లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో కంటెయినర్ లో ఉన్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన వినయ్ అనే డ్రైవర్‌కు గాయాలయినట్లు స్థానికులు తెలిపారు. చికిత్స నిమిత్తం ఇతనిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

ఉమ్మడి వనరుల అభివృద్ధితో లాభాలు

ముద్దనూరు ఆగస్టు28: చెరువులు, వాగులు, కుంటలు (ఉమ్మడి వనరుల)అభివృద్ధి వల్ల ఎన్నో లాభాలు కల్గుతాయని ఉమ్మడి వనరుల అభివృద్ధి క్లస్టర్ కో-ఆర్డినేటన్ లావణ్య పేర్కొన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఆమె మాట్లాడుతూ బడి, గుడి వద్ద మొక్కలు నాటేందుకు ఆసక్తి ఉన్నవారికి ఉచితంగా గంగిరెడ్డిపల్లెలోని ద్వారకనాథరెడ్డి నర్సరీ వద్ద మొక్కలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో గంగయ్య , ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు బాలక్రిష్ణ సినీస్వర్ణోత్సవ వేడుకలు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 28: సినీనటుడు నందమూరి బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నందమూరి యువసేవా సమితి అధ్యక్షుడు గోమేధికం సుదర్శన్, ఉపాధ్యక్షుడు సి.జె.వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం బాలకృష్ణ సినీస్వర్ణోత్సవ వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు. 30 వ తేదీ సాయంత్రం పొట్టిపాడు రోడ్డులోని ఎన్టీరామారావు విగ్రహం వద్ద స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని నందమూరి అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రామూనాయుడు, టీడీపీ జిల్లా కార్యదర్శి సిద్దయ్య, ఎస్సీసెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జున, బీసీసెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్బరాజు, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసింహ, సమర, క్రిష్ణచైతన్యరెడ్డి, హరీష్, తదితరులు పాల్గొన్నారు.